దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్, మార్చి 26 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జయమ్మ, చిలుకూరు బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ వేర్వేరు ప్రకటనలో మంగళవారం పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఆదిబట్ల, మార్చి 26 : ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం కావడంతో ప్రజలు ఆరు బయట పడుకుంటున్నారని, మెడలో విలువైన వస్తువులు బంగారు ఆభరణాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాన్నారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

చర్యలు తీసుకోవాలని వినతి

మొయినాబాద్, మార్చి 26 : అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విల్లాస్‌లు కడుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని బాకారం జాగీర్ రెవెన్యూలో సర్వే నంబర్ 72లో హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా విల్లాస్‌లను కడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కన్వీనర్ దేవేందర్, నాయకులు ప్రశాంత్, అంజయ్య, శివ, సురేందర్ పాల్గొన్నారు

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా యాదయ్యయాదవ్

మొయినాబాద్, మార్చి 26 : మండల పరిధిలోని ముర్తుజాగూడ గ్రామానికి చెందిన పాలమాకుల యాదయ్యయాదవ్‌ను బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ మంగళవారం అజీజ్‌నగర్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించారు. నియామక పత్రాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు మామిడి మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజు, జ్ఞానేశ్వర్, బట్టు రాజమల్లేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

జ్ఞానగిరి లక్ష్మీనరసింహస్వామి

పూజలో పాల్గొన్న భక్తులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 26 : మండలంలోని బాచారం గ్రామంలోని కొండపై కొలువైన జ్ఞానగిరి ఆలయ లక్ష్మీనరసింహస్వామి పన్నెండొవ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం ఉదయం సుప్రభాతసేవ, నిత్యారాధన, సేవాకాలం, ధ్వజారోహణం, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, ద్వారతోరణపూజ, చతుస్థానర్చన, పూర్ణాహుతి, తీర్థప్రసాదగోష్ఠి, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, సుదర్శన ఇష్టి, పూర్ణాహుతి, శతముర్రై, బలిహారణ జరిగాయి. 27న సుందరకాండ పారాయణం, కుంకుమార్చన, కుంబారాధన, చతుర్వేద పారాయణం, ఎదుర్కోలు ఉత్సవం, పూర్ణాహుతి, తీర్థగోష్ఠి, 28న అగ్ని ఆరాధన, మంగళస్నానం, నరసింహ ఇష్టి, పూర్ణాహుతి, లక్ష పుష్పార్చన, సాయంత్రం 5.30 గంటలకు శ్రీ స్వామివారి కల్యాణోత్సవం, పూర్ణాహుతి, 29న రథోత్సవం, చతుస్థానార్చన, రథబలి, 30న అగ్ని ఆరాధన, స్వామివారి మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, నిత్యారాధన, శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవ, ఆశీర్వచనం, కుంభప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని మాజీ సర్పంచ్ పారంద సంతోష, మాజీ ఉపసర్పంచ్ మోర ప్రభాకర్‌ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ మోర నర్సింగ్‌రావు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాచారం, మార్చి 26: దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నీఈవో నాగరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం రూ.30కోట్ల దీర్ఘకాలిక రుణాలకు ఇప్పటి వరకు కేవలం రూ.7 కోట్లు మాత్రమే వసూళ్లు అయ్యాయన్నారు. ఇంకా కనీసం రూ.17 కోట్లు వసూళ్లు అయితేనే తిరిగి కొత్త రుణాలను అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలను అందజేస్తామన్నారు. సహకార సంఘం పరిధిలో సీఎస్‌సీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంతో అనేక రకాల ఆన్‌లైన్ సేవలను రైతులు పొందవచ్చన్నారు. దీంతో రైతులకు మరింత సులభతరంలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. స్టోరేజీ కోసం నూతనంగా గోదాం నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, సహకార సంఘం వైస్ చైర్మన్ కారింగు యాదయ్య, డైరెక్టర్లు భాష, మక్కపల్లి స్వరూప, మద్దెల శశికళ, కళ్లమ్మ, మధుకర్‌రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ భిక్షం సేవలు మరువలేనివి

ధర్మభిక్షం చిత్రపటం వద్ద పూలమాలేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 26: కామ్రేడ్ ధర్మ భిక్షం సేవలు మరువలేనివని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ధర్మ భిక్షం వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మున్సిపాలిటీ పరిధి రావినారాయణరెడ్డి కాలనీలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. భూపోరాటాలతో వేలాది మంది పేదలకు భూములు పంచిన గొప్పనాయకుడని స్మరించుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నాయకులు కేతరాజు నర్సింహ, అరుణ, నవనీత, పుల్లయ్య, నారాయణ, నారాయణరెడ్డి, దేవమ్మ, చందన, బాల్‌రెడ్డి, సుధాకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ఆమనగల్లు :తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేట్ గ్రామానికి హస్‌రఫ్ అనే వ్యక్తి ఆమనగల్లు నుంచి మద్యాన్ని మంగళవారం తరలిస్తున్నాడు. తనిఖీలో భాగంగా చింతలపల్లి దగ్గర పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

క్యామ మల్లేశ్ విజయం ఖాయం

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో పెద్దఅంబర్‌పేట నాయకులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 26: భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆ పార్టీ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు కంచర్ల సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు చెరుకూరి జగన్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి వారు మంగళవారం క్యామ మల్లేశ్‌ను కలిశారు. బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇవ్వడంపై శుభాకాంక్షలు తెలిపారు. గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దేశారం బాలకృష్ణ, పిల్లి నగేశ్, పండుగల రాము, యంజాల రాము పాల్గొన్నారు.

పుస్తె మెట్టెలు అందజేత

పుస్తె మెట్టెలు కానుకగా అందజేస్తున్న సురక్ష సేవా సంఘం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 26 : మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉండే నర్సింహ దినసరి కూలీ. తన కుమార్తె వివాహానికి సాయం అందించాలని సురక్ష సేవా సంఘాన్ని ఆశ్రయించాడు. వెంటనే స్పందించిన సంఘం సభ్యులు స్పందించి పెండ్లి కుమార్తె అఖిలకు పుస్తె మెట్టెలను అందజేశారు. కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపీశంకర్‌యాదవ్, కార్యదర్శి కస్తూరి రమేశ్, సలహాదారులు నగవల్లి యాదగిరి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మహేశ్, ఎండీ యుసూఫ్, సభ్యులు అంజి, నబీ, చెంగయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల రైతులకు పట్టా పాస్‌పుస్తకాలివ్వాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ లక్ష్మమ్మ తదితరులు

యాచారం, మార్చి 26 : మండలంలోని మెండిగౌరెల్లి గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు పట్టా పాస్‌బుక్‌లు ఇవ్వాలని చింతపట్ల ఎంపీటీసీ తాండ్ర లక్ష్మమ్మ మంగళవారం తహసీల్దార్ అయ్యప్పకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వేనంబర్లు 19, 68, 127లోగల అసైన్డ్ భూముల్లో గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ రైతులు కొన్నేండ్లుగా పొలాలను సాగు చేసుకుంటున్నారని, వారంతా కబ్జామీద ఉన్నప్పటికీ ఆన్‌లైన్ పాస్‌బుక్‌లు రాలేదని తెలిపారు. పట్టా పాస్‌బుక్‌లు లేనందుకు నిరుపేద రైతులు రైతుబంధు, రైతుబీమా, పంటనష్ట పరిహారాన్ని కోల్పోతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ యాదగిరిరెడ్డి రవీందర్, రైతులు పాల్గొన్నారు.

ఉదయ్‌నగర్ కాలనీలో బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

బాక్స్ డ్రెయిన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

చంపాపేట, మార్చి 26: ముంపు ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయని.. త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం చంపాపేట డివిజన్ పరిధి ఉదయ్‌నగర్ కాలనీతో పాటు పలు కాలనీలవాసులు నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు మల్‌రెడ్డి రంగారెడ్డి నగర్, పద్మానగర్, ఉదయ్‌నగర్, సూర్యనగర్ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించి కాలనీల వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీవాసుల కోరిక మేరకు కాలనీల్లో పార్కులు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, ఓరుగంటి వెంకటేశంగౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, మహిళా వింగ్ అధ్యక్షురాలు శాగ రోజారెడ్డి, నాయకులు సదానంద్‌రెడ్డి, యూత్‌వింగ్ డివిజన్ అధ్యక్షుడు గండికోట శ్రీనాద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇండ్లే టార్గెట్

- మహారాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

బంగారు నగలును చూపుతున్న డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్, మార్చి 26 : తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను షాద్‌నగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ముఠా చోరీల వివరాలను షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి విలేకరులకు వివరించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా వైజాపూర్ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు రాజీవ్ శంకర్ పవర్, నాగపూర్‌కు చెందిన అజయ్ పవర్, తుల్జాపూర్ గ్రామానికి చెందిన అమూల్ అలియాజ్ షిండే, గొల్వాడి గ్రామానికి చెందిన పవన్ మచీంద్ర, నాగపూర్‌కు చెందిన ఎల్వాతిలు ఓ ముఠాగా ఏర్పడి తాళం వేసి ఇండ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఆమన్‌గల్లు, షాద్‌నగర్, కడ్తాల్, శంషాబాద్, కొత్తూరు, కేశంపేట, నందిగామ, పహాడిషరీఫ్, మహేశ్వరం, కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడి విలువైన నగలు, డబ్బులను అపహరించారు. ఆయా పోలీస్ స్టేషన్లలో మొత్తం 23 చోరీలపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. చోరీ కేసులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరం అంగీకరించారు. దొంగల ముఠా నుంచి 30 తులాల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభను చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి రివార్డులను అందజేశారు. సమావేశంలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐ ప్రతాపలింగం, సీసీఎస్ సీఐ పవన్, డీఐ రాంరెడ్డి పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని విద్యార్థి మృతి

యాచారం, మార్చి 26 : టిప్పర్ ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ (మేడిపల్లి) పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ నరసింహరావు వివరాల ప్రకారం.. కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామానికి అనుబంధంగా ఉన్న మాలగూడ గ్రామానికి చెందిన మంత్రి లోకేష్ (15) మీర్‌ఖాన్‌పేట జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన వలవోతు అంజయ్య అనే వ్యక్తి తన కూతురు ఆకులమైలారంలో ఉందని బైక్‌పై తీసుకురావాలని లోకేష్‌ను పంపించాడు. నందినిని తీసుకొని లోకేశ్ తన స్వగ్రామం మాలగూడకు బయలు దేరాడు. ఆకులమైలారం దాటి సరిగ్గా బీరప్పగుడి వద్దకు పోగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ బలంగా ఢీకొంది. ప్రమాదంలో లోకేష్ తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో నందినికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. టిప్పర్ వద్ద మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

షాద్‌నగర్, మార్చి 26 : చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేశ్ (35) అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకి లభించలేదు. గ్రామ సమీపంలోని తాళ్ల చెరువులోకి చేపలను పట్టేందుకు వెళ్లాడని పలువురు చెప్పడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ కూడా రమేశ్ ఆచూకి లభించలేదు. మరుసటి రోజు మధ్యాహ్నం సమయంలో రమేశ్ మృతదేహం తాళ్ల చెరువులో తేలడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చేపల వేటకు వెళ్లి చెరువులో పడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

ఆర్కేపురం, మార్చి 26 : ప్రసన్నాంజనేయ స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆలయ మాజీ చైర్మన్ జగిని రమేశ్ గుప్తా, సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, పుష్పలతారెడ్డి, రిషి, మహేందర్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నీటిని పొదుపు చేయాలి

హయత్‌నగర్ డిపోలో నీటి సంరక్షణపై ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

వనస్థలిపురం, మార్చి 26: జీవకోటికి ప్రాణాధారమైన నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి డీజీఎం రాజగోపాల్ అన్నారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జలమండలి సహకారంతో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకు ప్రజల నుంచి సహకారం ఉండాలని కోరారు. నీటిని పొదుపు చేయడం ద్వారా ఇబ్బందులను అరికట్టవచ్చన్నారు. అవకాశమున్న చోట ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. పాత ఇంకుడు గుంతలను పునరుద్ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడ్ సంస్థ డైరెక్టర్ నాగబ్రహ్మచారి, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పొదుపు అందరి బాధ్యత

సైదాబాద్, మార్చి 26: ప్రపంచ నీటి దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలో జలమండలి, స్పీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవ వారోత్సవాల అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలమండలి జీఎం ఖదీర్ మొయినుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటిని పొదుపుగా వాడుకోవటం ద్వారా భవిష్యత్ అవసరాలను తీర్చటానికి ఉపయోగం పడుతుందన్నారు. కాలనీలో తాగునీరు వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, తాగునీరు రోడ్లపై వదిలిపెట్టే వారిని ఇప్పటికే గుర్తించామని, వారికి నోటీసులు జారీ చేస్తున్నామని, తమ పద్ధతులను మార్చుకోకుంటే జరిమానాలను విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానికంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్పీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ నీళ్ల నందీశ్వర్ గౌడ్, ఆస్మాన్‌ఘడ్ జలమండలి డీజీఎం షీలారాణి, సైదాబాద్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, శ్రీనువాస్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

హయత్‌నగర్, మార్చి 26: నీటి సంరక్షణ కోసం ఇంటి ఆవరణంలో ప్రత్యేకంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆర్టీసీ సంస్థ హయత్‌నగర్ డిపో -1 మేనేజర్ విజయ్ సూచించారు. మంగళవారం హయత్‌నగర్ డిపోలో ''సీడ్ స్వచ్ఛంద సంస్థ, హెచ్ఎండబ్ల్యూ సహకారం''తో ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని నీటి సంరక్షణ, వినియోగంపై ఆర్టీసీ కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఇళ్లల్లో నీటిని వృథా చేసుకోకుండా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇంకుడు గుంతల ద్వారా నీటిని సంరక్షణ చేస్తేనే భవిష్యత్ తరాలకు మేలు చేసేన వారమవుతామని వివరించారు. వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో నీటికొరతకు అనుకూలంగా మారిందన్నారు. వర్షపునీటిని వడిసి పట్టడంతో పాటు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, నీటివృథాను అరికట్టుకోవాలని తెలిపారు. లేనియెడలా బెంగళూరు తరహాలో మంచినీటి కష్టాలు వస్తాయని చెప్పారు. నీటి సంరక్షణతోనే మంచినీటి కష్టాలు తొలుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.